క్లుప్తంగా

జగనన్న కాలనీలో నూతన 'వెలుగులు'

యడ్లపాడు: మండలంలోని జాలాది గ్రామంలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో విద్యుత్తు సౌకర్యం పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలోని బీసీ, ఎస్సీకాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి విద్యుత్తు అవసరాలను తీర్చడం కోసం ప్రభుత్వం వేగవంతంగా విద్యుత్తు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తుందని వైఎస్సార్ సీపీ మండల నాయకుడు గంటా శంకర్ తెలిపారు. రెండు కాలనీల్లోని నూతనంగా పూర్తి చేసిన పనులను ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి స్విచ్ ఆన్‌చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ జగనన్న కాలనీల్లో 55 విద్యుత్తు స్తంభాలను, 47 వీధి దీపాలను వాటికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పేదల ఇళ్ల నిర్మాణానికి విద్యుత్తు సమస్య ఉండకూడదన్న సంకల్పంతోనే తమ ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనను వేగంగా చేస్తుందన్నారు. కార్యక్రమంలో లైన్‌మెన్ పి.బాలబాస్కర్, కాంట్రాక్టర్ సైట్ సూపర్‌వైజర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణ కుటుంబాలకు వితరణ



వినుకొండ(నూజెండ్ల): బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం జీవీ మాధవరావు కార్యాలయంలో పేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ ఇప్పటివరకు 72 సార్లు పేద బ్రాహ్మణులకు వితరణ అందజేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్రరావు, ఉల్లగంటి మల్లికార్జునరావు, చంద్రమౌళి, డి.చంద్రశేఖర్, డి.రామ్మూర్తి, బాబు, బాలాజీ, చింతలపూడి సుబ్బారావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



ఈపూరు: మండలంలోని కొండ్రముట్ల పంచాయతీ పరిధిలోని దుష్మాన్‌పేట తండాలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో రెండు ఇళ్లు పూర్తిగా కాలిపోయి సర్వం కోల్పోయిన బాధితులకు బొల్లా వెంకటకోటయ్య సత్యవతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం, దుప్పట్లు, వంట సామగ్రి, ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు, ఈపూరు మాజీ ఎంపీపీ, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొల్లా వెంకటకోటయ్య మాట్లాడుతూ తమ ఫౌండేషన్ తరఫున అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవడం సంతోషంగా ఉందన్నారు. బొల్లా రమేష్‌బాబు, శ్రీనివాసరావు, ఈశ్వర్‌తేజ, మూడావత్ సోమ్లానాయక్, కోటానాయక్ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ జేఎల్‌ఎంల ఆత్మీయ సమావేశం



నాదెండ్ల: గణపవరం 33/11కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్‌లో గత మూడేళ్లుగా పనిచేస్తున్న జూనియర్ లైన్‌మెన్‌ల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. మండల పరిధిలో 2019 అక్టోబర్ రెండో తేదీన 12 మంది జేఎల్‌ఎం గ్రేడ్ -2 విధుల్లో చేరారు. వీరిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయడంతో కృతజ్ఞతగా ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. మండల విద్యుత్ ఏఈ పి.నాగ ప్రసాద్, జేఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరునికి పూజలు

అచ్చంపేట: మండలంలోని చామర్రులో పవిత్ర కృష్ణానది ఒడ్డున గల విఘ్నేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ కాశీ విశ్వేశ్వరునికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అ'పూర్వ' సమ్మేళనం



మూడున్నర దశాబ్దాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో బీఏ (1983–86) పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. దాదాపు మూడున్నర దశాబ్దాల అనంతరం కలుసుకున్న మిత్రులు ఆత్మీయంగా పలకరించుకొని నాటి అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో నాటి అధ్యాపకులు ఎ.హరిహరనాథశాస్త్రి, శివధర్మశాస్త్రి, గ్రంథాలయాధికారి కేవీకే రామారావు, ప్రస్తుత కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని పూర్వవిద్యార్థులు తెలిపారు.

గుర్తుకొస్తున్నాయి...!

సంతగుడిపాడు జెడ్పీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం 1988 నుంచి 1993 సంవత్సరం వరకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలలో వారు చదువుకున్న సమయంలో గడిపిన మధురక్షణాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకుని సరదాగా గడిపారు. ఒకరిపై ఒకరు జోక్స్ వేసుకుంటూ ఉల్లాసంగా కనిపించారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందెల సవ్వడి అలరించగా..

మూడో రోజు కొనసాగిన కళానిలయం జాతీయ స్థాయి సంగీత నాట్యపోటీలు



శ్రీకృష్ణుని వేషధారణలో నాట్యం చేస్తున్న కళాకారిణి

చిలకలూరిపేట: పురివిప్పిన నెమలిని తలపించే నృత్యాలు..మనసును పులకింపచేసే కీర్తనలు.. సుమధుర గీతాలు... ఉర్రూతలూగించే జానపద నృత్యాల నడుమ కళానిలయం 38వ జాతీయస్థాయి నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్య కళారూపాల పోటీలు ఆదివారం మూడో రోజు కొనసాగాయి. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కళ్యాణమండపంలో కొనసాగుతున్న ఈ పోటీలలో చివరిరోజు వివిధ అంశాలలో కళాకారులు ఉత్సాహంగా పాల్గొని కళారూపాలను ప్రదర్శించారు. పోటీలను కళానిలయం నిర్వాహకుడు ప్రగడ రాజమోహనరావు సతీమణీ శివసత్యనారాయణమ్మ నటరాజపూజ చేసి ప్రారంభించారు. సూర్య, చంద్ర విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలలో భరతనాట్యం, జానపద నృత్యాలతో పాటు శాస్త్రీయ బృందనాట్యాలు, జంటనాట్యాలు ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు వివిధ అంశాలలో తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.

నేడు రామయోగి స్వామి తిరునాళ్ల



పొట్లపాటి రామయోగి స్వామి మూల విరాట్

నూజెండ్ల: మండల కేంద్రమైన నూజెండ్లలో అవధూత పొట్లపాటి రామయోగి స్వామి తిరునాళ్ల సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా స్వామివారి దేవాలయాన్ని కొత్త రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. ఏడాదిలో మొట్టమొదటిగా వచ్చే తిరునాళ్ల రామయోగి స్వామిదే కావటం విషేషం. గ్రామంలోని నాలుగు దిక్కులలోని పాదులకు అభిషేకాలు చేయడంతో తిరునాళ్ల ప్రారంభమౌతుంది. తిరునాళ్ల సందర్భంగా ప్రధాన రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఐనవోలు ఎస్ఐ అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసు వారి అనుమతి తీసుకోవాలని ఎస్ఐ తెలిపారు.

ముందు తరాలకు ఆదర్శనీయుడు శాలివాహన చక్రవర్తి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి



శాలివాహన చక్రవర్తి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ జంగా

పిడుగురాళ్ల: రాబోయే తరాలకు శాలివాహనులు అంటే కుండలు చేసుకునే వారు కాదని, వారు కూడా రాజ్యాలను ఏలారని చెప్పాలని, దానికి నిదర్శనమే శాలి వాహన చక్రవర్తి అని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదుట ఉన్న శాలివాహన చక్రవర్తి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రాచీన భారత దేశంలోనే శాలివాహనల కోసం అంకురార్పన చేసిన వ్యక్తి శాలి వాహన చక్రవర్తి అని, శాలివాహనుల్లో కూడా రాజ్యాలను ఏలి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన వ్యక్తులు ఎంతో మంది ఉన్నారన్నారు. 1970లో కాసు బ్రహ్మానందరెడ్డి బీసీ వర్గీకరణ తీసుకుని 92 కులాలకు రిజర్వేషన్ కల్పించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల్లో కూడా కులగణన జరగాలని ఎంపీ విజయసాయిరెడ్డి చేత పార్లమెంట్‌లో కులగణన జగరాలని ప్రసంగింపజేసి ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకుని వెళ్లారన్నారు. దేశంలోనే అతి పెద్ద కులం శాలివాహన కులమని, భారత దేశంలోని 773 జిల్లాల్లో శాలివాహన కులం ఉందని తెలియజేశారు. నాగేంద్రస్వామి దైవం వలన శాలి వాహన చక్రవర్తిలు ఏర్పడి రాజ్యాలను ఏలా రని తెలియజేశారు. బీసీ వర్గాలు దేశంలోనే కొన్ని రాజ్యాలను పరిపాలించారని చరిత్ర ముందు తరాలకు తెలియజేస్తుందన్నారు. పరతి గ్రామంలో శాలివాహన కు లం ఉంటుందని, వారి వలన ఇంకా కుల వృత్తులు బతికి ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ కంపెనీలు వచ్చి కుల వృత్తులను కనుమరుగు అయ్యేలా చేస్తున్నాయన్నారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగారంటే అది ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలనే సాధ్యమైంద న్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌కొమ్ము ముక్కంటి, మార్కెట్ యార్డు చైర్మన్ కొమ్మెర వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, మాదాల కిరణ్‌కుమార్, అ బ్దుల్లా,ఎంపీడీవో కాశయ్య, శాలివాహన విగ్రహ క మిటీ అధ్యక్షులు మద్దిగుంట్ల కాశయ్య, ట్రెజరర్ పొ ద్దుటూరి గురు ప్రసాద్, చీరాల వెంకటేశ్వర్లు, శాలివాహన సంఘం టౌన్ అధ్యక్షులు నడికుడి వెంకటేశ్వర్లు, సెక్రటరీ రాజవరపు రాఘవ, ట్రెజరర్ శ్రీనివాసరావు, ఇల్లూరి వెంకటేశ్వర్లు, పొద్దుటూరి వీరాంజనేయులు, ఇల్లూరి వెంకయ్య పాల్గొన్నారు.

వైభవంగా పెదకూరపాడు తిరునాళ్ల



ప్రత్యేక ప్రార్థనలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: క్రైస్తవ విశ్వాసులు వైభవంగా 25 సంవత్సరాలు జూబిలి ముగ్గురు రాజుల మహోత్సవాన్ని పెదకూరపాడులో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పండగ సమిష్ట పూజాబలిని కడప బిషప్ డాక్టర్ రెవరెండ్ గాలిబాలి, నల్గొండ విశ్రాంతి బిషప్ జోసప్‌లు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి డాక్టర్ గాలిబాలి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్షమ,దయ, ప్రేమ, కరుణ కలిగి ఉండటమే క్రైస్తవ విశ్వాసులకు నిదర్శనమని తెలిపారు. దివ్య నక్షత్రం చూపిన మార్గంలో నడిచిన ముగ్గురు రాజులు బాలయేసును దర్శించుకుని మహిమత్వాన్ని పొందారన్నారు. దీనిని పురస్కరించుకుని ప్రతి ఏడాది ముగ్గురు రాజుల మహోత్సం జరుపుకొంటారని తెలిపారు. క్రైస్తవ విశ్వాసులు ఒత్తులను సమర్పించారు. స్థానిక విచారణ గురువులు పుట్టి సుందరరాజు, సంతోష్‌లు పండగ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పలువురు భక్తులు మోకాళ్లపై నడిచి తమ మొక్కులను తీర్చుకున్నారు. సీఐ వీరస్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నూజెండ్ల మండలంలోని కంభంపాడు గ్రామంలో వెన్ను కృష్ణ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో మొత్తం 32 జట్లు పాల్గొనడం జరుగుతుందన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20,116లు, రెండో బహుమతి రూ.14,116లు, మూడో బహుమతి రూ.8,116లు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.3వేలు అందజేయడం జరుగుతుందని వివరించారు.

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా ఆత్మకూరి



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న హరేరామ చెంచయ్య

సత్తెనపల్లి: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా సత్తెనపల్లి పట్టణానికి చెందిన సిల్వర్ స్టార్ సికెజిఎఫ్ ఆత్మకూరి వెంకట హరే రామచెంచయ్యను నియమించారు. ఆదివారం వినుకొండలోని షిరిడి సాయిబాబా దేవస్థాన కల్యాణ మండపంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 204/ఏ ఇన్‌స్టాలేషన్ ఆఫ్ డిస్ట్రిక్ క్యాబినెట్ -2023 టీం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గవర్నర్ గోల్డెన్ స్టార్ కజ్జాయం విజయలక్ష్మి నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా హరే రామ చెంచయ్యను పుర ప్రముఖులు, ఆర్య వైశ్య నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. వారిలో సత్తెనపల్లి శ్రీనివాస డైమండ్ క్లబ్ ప్రతినిధి అయినవోలు వెంకటేశ్వరరావు, సెక్రటరీ వనమా నాగేశ్వరరావు, వాసవి క్లబ్ ఫ్యామిలీస్ ప్రెసిడెంట్ కోట నాగ వరలక్ష్మి, సెక్రటరీ రెడ్డి సురేష్ కుమార్, తదితరులు ఉన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

ముప్పాళ్ల: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు వాటి వివరాలను ఈ-క్రాప్ కింద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ ఆదివారం చెప్పారు. జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగి, వరిగలు, వరి, పెసర, మినుము, నువ్వులు, అలసందలు, శనగలు, పొగాకు, ఇంక కూరగాయల పంటలు సాగు చేసిన రైతులు నమోదు చేసుకోవచ్చన్నారు. అందుకుగాను ఆధార్‌కార్డు, పట్టాదారుపాసుపుస్తకం, బ్యాంక్‌ఖాతా వివరాలు, ఫోన్‌నంబర్‌లతో పంటనమోదు అప్లికేషన్‌లో నమోదు చేయాలన్నారు. ఆయా వివరాలతో రైతుభరోసా కేంద్రంలోను సంప్రదించి నమోదు చేసుకోవచ్చన్నారు. అవకాశాన్ని రైతులు తప్పకుండా వినియోగించుకోవాలన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

సత్తెనపల్లి: మహిళలను ప్రోత్సహించేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల్లో భాగంగా మున్సిపాలిటీ స్థాయిలో ముగ్గుల పోటీలను సోమవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతాయని మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి ఆదివారం తెలిపారు. ఇటీవల వార్డు స్థాయిలో గెలుపొందిన మహిళలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. పోటీలను తిలకించేందుకు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు హాజరౌతారన్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలతోపాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు మండల స్థాయి ముగ్గుల పోటీలు..

రాజుపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల స్థాయి వైఎస్సార్ గ్రామీణ సంక్రాంతి ముగ్గుల పోటీలను సోమవారం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళిలు ఆదివారం తెలిపారు. మండలంలోని 18 గ్రామాల్లో ఎంపికైన గ్రామస్థాయి విజేతలు పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొని బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

రామాలయం నిర్మాణానికి లక్ష విరాళం

విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లోని లంకమోడు మత్స్యకారుల కాలనీలో నూతనంగా నిర్మాణం చేసుకుంటున్న రామాలయానికి మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీను ఆదివారం లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. ఇటీవల కాలనీలో జరిగిన గడప గడపకు మన ప్రభు త్వం కార్యక్రమంలో భాగంగా కాలనీ వాసులు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని రామాలయం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ పీఆర్కే చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమాన్ని జరిపినట్లు తెలిపారు. కాగా పీఆర్కే ఇచ్చిన హామీ మేరకు ఆలయం పనులు త్వరితగతిన పూర్తి చేసేలా ముందుగా లక్ష రూపాయలు మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు కారే మునలయ్య ఆధ్వర్యంలో కాలనీవాసులకు అందజేయడం జరిగిందన్నారు. మత్స్యకారుల నాయకులు అప్పలరాజు, బంగారాజు, నూకతల్లి, భూలోకమ్మ, రమణమ్మ, కోటి తల్లి, గంగరాజు, కాసులు, గోవిందు, ప్రసాద్, సతీష్, దుర్గాప్రసాద్, లక్ష్మమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరం



యడ్లపాడులో పత్యేక శిబిరంలో పోలింగ్ కేంద్రవద్ద బీఎల్‌వోలు

యడ్లపాడు: మండలం పరిధిలో ఆదివారం ఓటర్ల జాబితా ప్రక్రియలో భాగంగా ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించినట్లు తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఉదయం నుంచి సాయత్రం వరకు యడ్లపాడు మండలంలోని 57 ఎన్నికల కేంద్రాల వద్ద బీఎల్‌వోలు ఉండి ఇప్పటి వరకు ఓటుకు ఆధార్ అనుసంధానం చేయని ఓటర్లకు లింకు చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఫారం-బిను పూర్తి చేసి 300 మంది ఓటర్లకు తమ ఆధార్ నంబర్లను ఆన్‌లైన్‌కు అనుసంధానం చేశామన్నారు.

రీసర్వే పనులు వేగవంతం

యడ్లపాడు: మండలం పరిధిలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూరక్ష -భూహక్కు కార్యక్రమం చురుగ్గా కొనసాగుతుందని తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే రీసర్వే ప్రక్రియలో భాగంగా గతంలోనే ఫేజ్-1 కింద మండలంలోని మర్రిపాలెం, విశ్వనాథకండ్రిక రెవెన్యూ గ్రామాల్లో పూర్తికాగా, తాజాగా మైదవోలు, కారుచోల, జాలాది, సందెపూడి గ్రామాల్లో ఫేజ్-2 సర్వే పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం సొలస, ఉన్నవ రెవెన్యూల పరిధిలో డేటా ఎంట్రీ పనులు చేస్తుండగా, తిమ్మాపురం, యడ్లపాడు, తుర్లపాడు, వంకాయలపాడు గ్రామాల్లో ఎల్‌పీఎం, సర్వేనంబర్ల గుర్తింపు పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. వీటితో పాటు కొండవీడు రెవెన్యూ పరిధిలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలో రీసర్వేపై గ్రామసభను నిర్వహించి రీసర్వేకు సంబంధించిన వివరాలను వెల్లడించామని పేర్కొన్నారు. అయితే ఈ రెవెన్యూ పరిధిలో కొందరు ఈనాం రైతులు తమ సాగు భూములకు సంబంధించిన వివాదం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున సదరు భూములను మినహాయించి మిగిలిన వాటిని రీసర్వే చేస్తున్నామని వివరించారు. రైతులు తమ గ్రామం పరిధిలో జరిగే రీసర్వేలో విధిగా పాల్గొని సర్వే బృందాలకు తమ భూములకు సంబంధించిన హక్కుపత్రాలను, హద్దులను చూపించి సహకరించాలని కోరారు.

11న వడ్డే ఓబన్న జయంతి

సత్తెనపల్లి: పట్టణంలోని 24 వార్డు సాలిపేట నందు గల శ్రీ తేనె అంకమ్మ తల్లి దేవస్థానంలో ఈ నెల 11న ఉదయం 9 గంటలకు వడ్డే ఓబన్న జయంతి ఉత్సవం జరుగుతుందని సత్తెనపల్లి పట్టణ వడ్డెర సేవా సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. వడ్డెర సంఘ పెద్దలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.